## క్లుప్తంగా

### వైఎస్సార్ సీపీ నేతకు ఎమ్మెల్యే పరామర్శ



ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మోర్ల సాంబశివరావు తండ్రి మోర్ల సుబ్బారావు ఇటీవల మృతి చెందారు. సాంబశివరావు కుటుంబాన్ని బుధవారం తిరువూరు శాసన సభ్యులు కే రక్షణనిధి పరామర్శించారు. సర్పంచ్ మోర్ల లక్ష్మి, జెడ్పీటీసీ భూక్య గనియా, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు కాలసాని చెన్నారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు బెజవాడ నాగకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు పాలం ఆంజనేయులు, గుర్రాల వెంకట్రావు, అత్తనూరు వెంకటరెడ్డి, ఎంపీడీఓ నాగేశ్వరరావు పలువురు పాల్గొన్నారు.

### పూలే అవార్డుకు ఎంపిక


రాంప్రదీప్

తిరువూరు: మండలంలోని గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రాంప్రదీప్‌కు జ్యోతిరావు పూలే అవార్డు లభించింది. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో పేద విద్యార్థులకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్, గ్రామర్ తదితర కోర్సులను బోధిస్తున్నందుకు రాంప్రదీప్‌కు పూలే టీచర్స్ ఫెడరేషన్ ఈ అవార్డును ప్రకటించింది. ఈ నెల 16న తిరుపతిలో ఈ అవార్డు అందుకోనున్నట్లు రాంప్రదీప్ తెలిపారు.

### నాడు-నేడు పనులు వేగవంతం చేయాలి

గంపలగూడెం: నాడు-నేడు పథకం రెండవ ఫేజ్ లో ఎంపికైన పాఠశాలల్లో పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బుధవారం సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని 31 పాఠశాలలు, 4 అంగన్వాడీ కేంద్రాలు, కేజీబీవీ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రూ.11కోట్లతో నాడు-నేడు పథకంలో అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఇప్పటి వరకు రెండు విడతలుగా రూ.3.09 కోట్లు విడుదలయ్యాయన్నారు. కనుమూరు హైస్కూలుకు సంబంధించి ఇంత వరకు పైసా ఖర్చు కూడా చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. గంపలగూడెం హైస్కూలు పీఎంసీ చైర్మన్ పనుల నిర్వహణలో సహకరించట్లేదని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.జమలయ్య, అధికారుల దృష్టికి తెచ్చారు. ఎంఈఓ సోమశేఖర్‌నాయక్, పీఆర్ ఏఈ పూర్ణచంద్రరావు, కేజీబీవీ ప్రత్యేక అధికారి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

### క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

నూజివీడు : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని పంచాయతీరాజ్ శాఖ నూజివీడు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.బాపిరెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రీ సారథి ఇంజినీరింగ్‌లో బుధవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తోన్న సారథి ఫెస్ట్-23 ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కళాశాల కరస్పాండెంట్ స్వర్ణశ్రీ, ప్రిన్సిపాల్ సూరానేని శ్రీధర్ మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కళాశాల చైర్మన్ సుధీర్, డైరెక్టర్ సాయిరామ్, కళాశాల పరిపాలనాధికారి జీ రామచంద్రరావు, ఫెస్ట్ కన్వీనర్లు పీ చెన్నారావు, కే నాగేశ్వరరావు, పలు విభాగాల హెచ్‌వోడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు క్విజ్ పోటీలు

తిరువూరు: నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో స్థానిక శాఖా గ్రంథాలయంలో జలసంరక్షణపై అవగాహన కల్పిస్తూ బుధవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. నీటిని సంరక్షించుకోవలసిన ఆవశ్యకతను నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ వినోద్ వివరించారు. నీటిని పొదుపుగా వాడటంతో పాటు రీసైక్లింగ్ ద్వారా వృథా నీటిని తాగునీటి అవసరాలకు వినియోగించుకోవచ్చని సూచించారు. గ్రంథాలయాధికారిణి పద్మావతి, నెహ్రూ యువక కేంద్ర అధికారి రాము పాల్గొన్నారు.

### అటవీ, రెవెన్యూ భూముల సర్వే

ముసునూరు : మండలంలోని రమణక్కపేటలో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు హక్కుల కోసం గత ప్రభుత్వ హయాంలో విశ్వ ప్రయత్నాలు చేశారు. కాని సాధ్యపడలేదు. దీనిపై పేదలు స్పందనలో అర్జీలు సమర్పించడంతో తహసీల్దార్ దాసరి సుధ, ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెవెన్యూ, అటవీ శాఖాధికారులు ఇరు శాఖల భూములకు సరిహద్దులు నిర్ణయించేందుకు బుధవారం సర్వే ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ రంగు ధనలక్ష్మి గాంధీ, సర్వేయర్ సురేష్ బాబు, వీఆర్వో విజయకుమారి, డీఆర్వో హరిగోపాల్, ఇరు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

### వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఆగిరిపల్లి : మండలంలోని నెక్కలం అడ్డరోడ్డులో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ ఆరో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, రక్షాబంధనము, 108 కలశములతో శ్రీవారికి స్నపన, విశేష అలంకరణ, నివేదన నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు పొట్లూరి వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'


రేగుంట కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు


పర్వతాపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న దేశిరెడ్డి

నూజివీడు : నూజివీడు పట్టణం, మండలంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ప్రతి వార్డులోనూ, గ్రామాల్లోను పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికీ పర్యటిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని ఆయా కుటుంబాల వారికి తెలియజేస్తున్నారు. రేగుంటలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకతీతంగా అర్హులందరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గత టీడీపీ పాలనలో ఎదుర్కొన్న ఇబ్బందులను ఆయన గుర్తు చేశారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చంద్రబాబు చెప్పే మాయమాటలు నమ్మితే రాష్ట్రం అధోగతి పాలవ్వడం ఖాయమన్నారు. ప్రస్తుతం అమలవుతోన్న సంక్షేమ పథకాలేవీ ఉండవని అన్నారు. గతంలో రైతు రుణమాఫీ, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేయకుండా మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అని ధ్వజమెత్తారు.

**పర్వతాపురంలో...**

చాట్రాయి: మండలంలో పర్వతాపురం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి పాల్గొని మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇల్లు ఆర్థికంగా నిలబడుతుండడంతో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులను సాదరంగా ఆహ్వానిస్తున్నారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రజాస్పందన చాలా బాగుందని ఆయన చెప్పారు. సర్పంచ్ మిద్దె శివాజీ, ఎంపీపీ లంకా నిర్మల, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలో గ్రామాలు, కొండపలి మున్సిపాల్టీలో ఉత్సాహంగా కొనసాగుతుంది. బుధవారం జూపూడిలో మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు, సర్పంచి కాకి దేవమాత, ఇబ్రహీంపట్నంలో పీఏసీఎస్ చైర్మన్ మునగాల శివారెడి, సచివాలయ కన్వీనర్ల కోఆర్డినేటర్ లంకే అంకమోహనరావు సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. మానమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు, ఫోన్‌లకు, డోర్‌లకు అంటించారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, గృహ సారథులు, కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

జి.కొండూరు: ప్రజలకు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేశాం కాబట్టే ప్రతి గడపకు ధైర్యంగా వెళ్తున్నామని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. జి.కొండూరులో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావు, సర్పంచ్ మండల అరుణ, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ వేములకొండ విష్ణుతో పాటు పలువురు నాయకులు ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పంపిణీ తీరుపై ప్రజాభిప్రాయసేకరణ చేశారు.

ముసునూరు : మండలంలోని అన్ని గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. జెడ్పీటీసీ, సచివాలయాల కన్వీనర్ వరికూటి ప్రతాప్ ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ పెద్దలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకం అవుతున్నారు. ఎంపీపీ ఆర్. కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, గ్రామ పార్టీల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీల అధ్యక్షులు, భారీ స్థాయిలో కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేస్తూ జగనన్న ప్రవేశ పెట్టిన పథకాలను వివరిస్తున్నారు.

గంపలగూడెం: మండలంలోని ఆయా సచివాలయాల పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు ఇంటింటికి తిరిగారు. గత ప్రభుత్వం విధానాలకు ప్రస్తుత ప్రభుత్వ తీరుకు తేడాను పరిశీలించాలని కోరారు. ప్రజాభిప్రాయాలను సేకరించారు. కుటుంబీకుల ఇష్టం మేర మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను ఇళ్లకు అంటించారు. పార్టీకి పరజల మద్దతు కోరుతూ టోల్‌ఫ్రీ నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వాలని కోరారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలే లక్ష్యం

- ఎమ్మెల్యే రక్షణనిధి
- పాత కొండూరులో గడప గడపకు మన ప్రభుత్వం


పాత కొండూరులో బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

ఎ.కొండూరు: రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులై ప్రతి ఒక్కరికీ అందిస్తున్నామని తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కే రక్షణనిధి పేర్కొన్నారు. మండలంలోని పాత కొండూరులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలపై వివరిస్తూ ఒక్కొక్క కుటుంబం లబ్ధి పొందిన పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ గ్రామంలో అర్హులైన వారందరికి ప్రభుత్వ, సంక్షేమ పథకాలు అందుతున్నాయని, అర్హులై ఉండి పథకాలు అందని వారు ఉంటే గ్రామ సచివాలయంలో వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేయించుకోవాలన్నారు. ప్రజా సమస్యలు తమ దృష్టికి వస్తే వెంటనే పరిష్కరించటానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ నిరుపేదలకు అండగా ఉంటున్నారన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పించి, మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ వెంపాటి రజిని, వైస్ ఎంపీపీ సిద్దం పద్మ, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జడ్పీటీసీ భూక్య గనియా, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షులు కాలసాని చెన్నారావు, పీఏసీఎస్ చైర్మన్లు పాలం ఆంజనేయులు, ఆత్తనూరు వెంకటరెడ్డి, కోటగిరి రాంబాబు, మాజీ సర్పంచులు సతీష్, సోలా నరసింహారావు, ఎంపీటీసీ కోటా పుల్లారావు, ఎంపీడీఓ నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పలు శాఖాల అధికారులు పాల్గొన్నారు.

## ఆదుకుంటున్న సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌తో లబ్ధిదారులు
- మైలవరంలో గడప గడపకు మన ప్రభుత్వం


మైలవరంలో లబ్ధిదారుడి సమస్య వింటున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం: ఎలాంటి ఆదరణ లేని ఎంతో మందికి ముఖ్యమంత్రి జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కల్పవృక్షంలా ఆదుకుంటున్నాయని లబ్ధిదారులు చెబుతున్నారు. మైలవరం గ్రామ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం జరిగింది. స్థానిక శాసన సభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొని గడప గడపకు తిరుగుతూ ముఖ్యమంత్రి జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఇంటి యజమానుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు ఆదేశించారు.ఈ సందర్భంగా కొందరు లబ్ధిదారులు ఎమ్మెల్యేతో మాట్లాడారు. సంక్షేమ పథకాలు ఎంతో మంది కడుపులు నింపుతున్నాయన్నారు. ఎమ్మెల్యే వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రతి గడపలో జగనన్న సంక్షేమ పథకాల ముద్ర కన్పిస్తోందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్నవారు, పేద కుటుంబాలు, నిత్యం చెమటోడ్చి కష్టపడి పని చేసుకుని బతికే శ్రమ జీవులు, పిల్లల ఆదరణకు నోచుకోని వృద్ధులు, ముఖ్యంగా దివ్యాంగులు, మహిళలు, ఆడపడుచులు, విద్యార్థులు, రైతులు ఎంతో మంది మోముల్లో ముఖ్యమంత్రి జగన్ పథకాల చిరునవ్వులు చిందిస్తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

మైలవరం: స్థానిక గ్రామ సచివాలయం-5 పరిధిలో కార్యక్రమం బుధవారం సాయంత్రం జరిగింది. ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సచివాలయం-5 పరిధిలో రూ.11.48 కోట్ల సంక్షేమ పథకాలకు వెచ్చించినట్లు తెలిపారు.

## సీఎం వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు
- ముక్కొల్లుపాడులో గడప గడపకు మన ప్రభుత్వం


ముక్కొల్లుపాడులో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు : రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం రెండూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని ముక్కొల్లుపాడులో బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసి చూపించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. విద్యామౌలిక సదుపాయాల కల్పన సంస్థ రాష్ట్ర డైరెక్టర్ కలగర వెంకటేశ్వరరావు, సర్పంచ్ కంచర్ల సుబ్బలక్ష్మి, ఎంపీపీ ఆరేపల్లి శిరీషా, ఎంపీడీవో సుందరి, తహసీల్దార్ డీవీఎస్ యల్లారావు, ఏడీఏ విద్యాసాగర్, ఏవో చాముండేశ్వరి, ఏరియా కోఆర్డినేటర్ దయాల రాజశేఖర్, ఏపీవో సోమేశ్వరి, ఏపీసీపీడీసీఎల్ ఏడీఈ ఓలేటి దుర్గారావు, ఏఈ త్రిమూర్తులు, నూజివీడు సొసైటీ అధ్యక్షుడు బొబ్బిలి సాయిబాబు, వ్యవసాయ సలహా మండలి నియోజకవర్గ చైర్మన్ పల్లె రవీంద్ర రెడ్డి, ఆరేపల్లి రాంబాబు, ముల్లంగి జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

**రైతు భరోసా కేంద్రం ప్రారంభం**

నూజివీడు : మండలంలోని ముక్కొల్లుపాడులో రూ.22 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. వ్యవసాయ సలహా మండలి నియోజకవర్గ చైర్మన్ పల్లె రవీంద్రరెడ్డి, నాయకులు బొబ్బిలి సాయిబాబు, ఆరేపల్లి రాంబాబు, ముల్లంగి జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

## చివరి దశకు చేరుకున్న భూ సర్వే

గంపలగూడెం: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా భూ రీసర్వే పూర్తయిన మండలంలోని ఆరు గ్రామాల్లో రైతులు, ప్రభుత్వం భూములకు సరిహద్దు రాళ్లను (బౌండరీస్) ఏర్పాటు చేసే కార్యక్రమం 85 శాతం పూర్తి చేసినట్లు తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. అనుముల్లంక, వినగడప, గంపలగూడెం, చెన్నవరం, రాజవరం గ్రామాలలో అధికారులు భూ రీ సర్వే పూర్తి చేశారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భూములకు సంబంధించి 2,393 ఎల్పీఎంలు కేటాయించారు. సంబంధిత ఎల్పీఎంల వారిగా భూములకు సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేసేపనిని కొనసాగిస్తున్నారు. ఆయా భూములకు 8,940 రాళ్లను పాతాల్సి ఉండా ఇప్పటి వరకు 7,524 రాళ్లు పాతారు. ఇంకా 1416 రాళ్లను పాతాల్సి ఉందన్నారు. ఆర్ఐ మోహన్, వీఆర్వోలు ప్రతాప్, ప్రభాకర్‌రెడ్డి, దుర్గారావు, ఎం.వెంకటేశ్వరరావు, ఇమ్రాన్‌పాషా, కే వెంకటేశ్వరరావులు, గ్రామ సచివాలయాల సర్వేయర్లు, రైతుల సమక్షంలో సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేయిస్తున్నారు. రాజవరంలో నూరుశాతం, చెన్నవరంలో 99.80 శాతం రాళ్ల ఏర్పాటు పూర్తయిందన్నారు. మిగిలిన నాలుగు గ్రామాల్లో ఈనెల 20వ తేదీ నాటికి పూర్తి చేస్తామని తహసీల్దార్ వివరించారు. సరిహద్దు రాళ్ల ఏర్పాటుకు రైతులు సహకరించాలన్నారు. ప్రతి గ్రామంలో రీ సర్వే చేసి సరిహద్దు రాళ్లను ప్రభుత్వమే ఏర్పాటు చేయటంతో ఎంతోకాలంగా రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారించబడుతున్నాయన్నారు. భూ రీ సర్వే రెండో భాగంగా మండలంలోని 16 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే కొనసాగిస్తున్నట్లు తహసీల్దార్ వివరించారు.

## భూసార పరీక్షలపై శిక్షణ

నూజివీడు: భూసార పరీక్షలు నిర్వహించడం ద్వారా భూమిలో ఉన్న పోషకాల గురించి తెలుసుకోవచ్చని నూజివీడు ఏడీఏ విద్యాసాగర్ పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి తుక్కులూరులోని రైతు భరోసా కేంద్రంలో భూసార పరీక్షలు, మట్టిన మూనాల సేకరణపై శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆలూరు చాముండేశ్వరి, ఏవో మాధవి ప్రియానంద, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

చాట్రాయి: భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని వ్యవసాయ అధికారి బి.శివ శంకర్ అన్నారు. బుధవారం మండలంలోని చాట్రాయి ఆర్‌బీకేలో భూసార పరీక్షలపై గ్రామ వ్యవసాయ సహాయకులకు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు.

ముసునూరు: భూసార పరీక్షలతో మేలు జరుగుతుందని ఏలూరు వ్యవసాయ శాఖ ఏడీఏ డీఆర్‌సీ లలిత సుధ పేర్కొన్నారు.ఎంఏవో సీహెచ్.శ్రీనివాస్ ఆర్‌బీకే సిబ్బందికి మట్టి నమూనా సేకరణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మట్టి నమూనాలనుసేకరించారు.వీఏఏలు,వీహెచ్ఏలు,వీఎస్ఏలు పాల్గొన్నారు.

## రుణాలను నేరుగా బ్యాంకుల్లో చెల్లించండి

**డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్**


మల్లెంపాడులో మాట్లాడుతున్న శ్రీనివాస్

మల్లెంపాడు(గంపలగూడెం): రుణాలను తిరిగి చెల్లించే సమయంలో స్వయం సహాయక సంఘాల మహిళలు నేరుగా బ్యాంకులకు వెళ్లాలని మధ్యలో ఎవరికి నగదు ఇవ్వవద్దని డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్ సూచించారు. వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సహాయాన్ని మహిళలు తమ జీవనోపాధి పెంచుకునేలా వినియోగించుకోవాలని పీడీ కే శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని దుందిరాలపాడు పంచాయతీ పరిధిలోని మల్లెంపాడులో బుధవారం నిర్వహించిన గ్రామ సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను చేపడుతుందన్నారు. ఆయా పథకాల ద్వారా తీసుకున్న రుణాలను మహిళలు సద్వినియోగ పర్చుకోవాలన్నారు. రుణాలను తిరిగి సకాలంలో చెల్లించడం ద్వారా బ్యాంకుల్లో పరపతి పెంచుకోవాలని సూచించారు. గేదెలు, పొట్టేళ్ల పెంపకం, చేతి వృత్తుల్లో నైపుణ్యం ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు వెదురు లింగమ్మ, ఏపీఎం జే నాగరాజు, సీసీ అనంద్, గ్రామ సమాఖ్య ప్రతినిధులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాలకు అండగా సీఎం జగన్


మాట్లాడుతున్న బాపట్ల ఎంపీ నందిగం సురేష్

ఆగిరిపల్లి : రాష్ట్రంలో అణగారిన వర్గాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అన్నారు. స్థానిక నూజివీడు రోడ్డులోని పొన్నం కల్యాణ మండపంలో బుధవారం రాత్రి దళిత ఐక్యవేదిక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి ఎంపీ, బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, జ్యోతిరావు పూలే వంటి మహానీయుల జయంతి కార్యక్రమాలను ఏప్రిల్ నెలలోనే జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆ మహానీయులు ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం చేసిన కృషి ఫలితమే మనం ఉన్నత స్థానాలలో ఉన్నామని పేర్కొన్నారు. వారి బాటలోనే సీఎం జగన్ అడుగులు వేస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. మారుమూల గ్రామంలో ఉండే దళితుడిని అయిన తనను ఎంపీని చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గతంలో చంద్రబాబు తన వర్గానికే న్యాయం చేశాడని, సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు పెద్ద పీట వేశారన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలబడాలన్నారు. లేకుంటే అణగారిన వర్గాలు మళ్లీ అట్టడుగుకు వెళ్లిపోతారన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ నాయకులు పోతర్లంక లక్ష్మణరావు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరసింహారావు, జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, ఎంపీపీ అనూషా ఇసాక్, ఎంపీడీవో వాణి, మండల మహిళా అధ్యక్షురాలు పావన జ్యోతి సుజనకుమారి, వైస్ ఎంపీపీ రమేష్, నగ్గూరు సర్పంచి దిలీప్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## బీమా సాయం అందజేత

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలనులో దేవర శ్రీనివాసరావు (42) బుధవారం మృతి చెందగా వైఎస్సార్ బీమాలో భాగంగా రూ.10 వేల తక్షణ సహాయాన్ని అందజేశారు. ఆ మొత్తాన్ని మృతుని భార్య దేవర నాగమణికి వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు గోగులమూడి చెన్నకేశవరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వెదురు శ్రీనివాసరెడ్డి అందజేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ కే గోపాలకృష్ణ, వార్డు సభ్యులు పాశం సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎ.కొండూరు: మండలంలోని పోలిశెట్టిపాడు పీఏసీఎస్ పరిధిలోని గోపాలపురం గ్రామానికి చెందిన పీఏసీఎస్ సంఘ సభ్యుడు బి.బాల్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో మృతుని కుటుంబానికి బుధవారం సహకార సంఘం, కేడీసీసీ బ్యాంకు తరపున రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.పీఏసీఎస్ చైర్మన్ తుమ్మూరు వెంకటేశ్వరరెడ్డి, బ్యాంకు మేనేజర్ పి.సత్యనారాయణ, సీఈఓ పి.కోటేశ్వరరావు, సర్పంచ్ కోలా శ్రీనివాసరావు, బి.శ్రీను, ఎం.రవికుమార్, పలువురు పాల్గొన్నారు.

### రేపటి నుంచి సీపీఎం ప్రచార భేరి

మైలవరం: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించి దేశాన్ని కాపాడుకుందామని సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. మైలవరం సీపీఎం కార్యాలయంలో పార్టీ మండల కమిటీ సమావేశం బుధవారం జరిగింది. పలువురు నాయకులు పాల్గొన్నారు.

### టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి..


ఎమ్మెల్యే మేకా ప్రతాప్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

నూజివీడు : రాష్ట్ర ప్రజల కోసం నిరంతరం పనిచేసే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని తూర్పుదిగవల్లిలో టీడీపీకి చెందిన ఐదు కుటుంబాలు బుధవారం ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే ప్రతాప్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చిన్ని మల్లికార్జునరావు, చిన్ని తిరపతిరావు, చిన్ని సుబ్బారావు, చిన్ని గోవర్ధనరావు, చిన్ని గోపయ్య కుటుంబాలు పార్టీలో చేరారు. ఎంత అభివృద్ధి జరిగినా టీడీపీ నాయకులు కళ్లుండీ కబోదుల్లా మాట్లాడుతున్నారన్నారు. రైతు సలహామండలి నియోజకవర్గ చైర్మన్ పల్లె రవీంద్రరెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు జగ్గవరపు నరసారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, పాలకేంద్రం అధ్యక్షుడు ఎం.మాధవరావు, మాజీ సర్పంచి నక్కనబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### 170 మందికి కంటి వైద్య పరీక్షలు

చంద్రాల (మైలవరం): ఉచిత కంటి వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని గ్రేస్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గొర్రె డానియల్ తెలిపారు. మైలవరం మండలం చంద్రాల గ్రామంలోని మెట్రో పాలిటన్ చర్చిలో గ్రేస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గొర్రె డానియల్ మాట్లాడుతూ పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉచిత సేవలు అందించడానికి తమ సంస్థ ముందుంటుందన్నారు. తల నొప్పి ఉన్నవారికి కళ్లద్దాలు, చుక్కల మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 170 మంది గ్రామస్తులు ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు.

**పాత నాగులూరులో...**

పాత నాగులూరు(రెడ్డిగూడెం): మండలంలోని పాత నాగులూరు గ్రామంలోని మోజెస్ చర్చిలో శాంతి స్వస్థత శాల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ పేదలకు సేవ చేయడం దేవుని సేవతో సమానమన్నారు. గ్రామానికి చెందిన 200 మంది ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి కళ్ల జోళ్లు, చుక్కల మందు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

### ప్రత్యేక పూజలు

ఇబ్రహీంపట్నం: స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో నూతన ఆర్థిక ఏడాది ప్రారంభం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. బ్రాంచి మేనేజర్ పాలే రమేష్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. మేనేజర్ రమేష్ ఎల్ఐసీ వలన కలిగే ప్రయోజనాలు స్థానికులకు వివరించారు. జీవిత భీమా సంస్థలో సభ్యులుగా చేరి సంస్థను ఆదరించాలని కోరారు. జీవిత బీమాతో కుటుంబాలకు భరోసా ఉంటుందన్నారు. డెవలప్‌మెంట్ అధికారి చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

### ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

విస్సన్నపేట: మండలంలో 12 గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ ఎస్.వెంకటరటరమణ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు, టెక్నికల్ అసిస్టెంట్లకు సమావేశం బుధవారం నిర్వహించారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని, మస్టర్ నమోదు, పనిప్రదేశంలో ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని ఎంపీడీఓ అన్నారు. నిబంధనల ప్రకారం పనులు నిర్వహించాలని ఆయన ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ అనురాధ, ఈసీ దాసు పాల్గొన్నారు.

### మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

తిరువూరు: యుక్తవయసులో ఉన్న బాలికలను పలు రకాల ప్రలోభాలకు గురిచేసి మోసంచేసే వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ చంద్రయ్య సూచించారు. తిరువూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికోన్నత పాఠశాలల్లో విద్యార్థినులకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మానవ అక్రమరవాణా, వాణిజ్య పరమైన లైంగిక దోపిడీ అనే అంశంపై ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సహకారంతో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మోసపూరిత మాటలు చెప్పేవారితో జాగ్రత్తగా వ్యవహరించాలని, తల్లిదండ్రులకు, పోలీసులకు, స్త్రీ శిశు సంక్షేమశాఖకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఐసీడీఎస్ తిరువూరు ప్రాజెక్టు అధికారిణి సత్యవతి, ఏసీడీపీవో ఝాన్సి, పాఠశాలల హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.